ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 32.0 | కనిష్ఠం : 21.0
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
శుక్రవారం 20 సెప్టెంబరు 2024



కృష్ణమ్మ ఒడిలో.. భూదేవి అందాలు

- నదిలో 14 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన దీవులు
- ఆకట్టుకుంటున్న నల్లమల అందాలు
- పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తే మరింత అభివృద్ధి చెందుతుందంటున్న స్థానికులు



చీమలతిప్ప వద్ద రెపరెపలాడుతున్న జాతీయ జెండా



మల్లేశ్వరం సమీపంలో నది మధ్య 14 ఎకరాల విస్తీర్ణంలోని పెద్దగుట్ట దీవి



కృష్ణమ్మ ఒడిలో చీమలతిప్ప దీవి

కొల్లాపూర్, సెప్టెంబరు 19: కనుచూపు మేర పారుతున్న కృష్ణానది చుట్టూ ఎత్తైన కొండలపై నల్లమల అడవుల అందాలు ఒక వైపు, కృష్ణమ్మ ఒడిలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో భూదేవి అందాలు మరో వైపు, ఆ దీవిలో దాదాపు 50 కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతం చూపరులను ఆకట్టుకుంటోంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అమరగిరి గ్రామం నుంచి కృష్ణానదిలో అరగంట పాటు ప్రయాణిస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో కనువిందు చేసే ఈ ప్రాంతమే చీమలతిప్ప. ఈ దీవిని సందర్శించేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. అక్కడ నివసించే వైజాగ్ జాలర్ల స్థితిగతులను వారు పూరిగుడిసెల్లో ఉపయోగించే ఆధునికమైన పరికరాలను వారి జీవన విధానాన్ని తెలుసుకునేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. చుట్టు ఉన్న కృష్ణానది మధ్య తమ పిల్లాపాపలతో ఎన్నో ఏళ్లుగా వైజాగ్ జాలర్లు నివసిస్తూ అక్కడే చేపల వేట కొనసాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. జీవనోపాధితో పాటు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ స్వచ్ఛమైన గాలి అనుభూతిని పొందుతూ పచ్చని కొండల మధ్య జీవితాన్ని గడుపుతున్నారు. ప్రతీ ఆదివారం వీరంతా కొల్లాపూర్ మండల కేంద్రంలో నిర్వహించే సంతకు వచ్చి వారానికి సరిపడా నిత్యావసర సరకులు తీసుకుని వెళ్తుంటారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాగ్ ప్రాంతానికి చెందిన జాలర్లు అయినా తెలంగాణ రాష్ట్రంతో ఇక్కడి ప్రజలతో ఎన్నో ఏళ్లుగా మమేకమై తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. అదేవిధంగా కొల్లాపూర్ నియోజకవర్గ ంలోని పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం గ్రామం నుంచి కృష్ణానదిలో మరబోటుపై సోమశిల గ్రామం వైపు ప్రయాణిస్తే 14ఎకరాల విస్తీర్ణంలో పర్యాటకులకు కనువిందు చేసే ఐలాండ్(పెద్దగట్టు) ఎంతో ఆకర్షిస్తోంది. నిత్యం హైదరాబాద్ నుంచి పర్యాటకులు పెద్ద ఎత్తున ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఈ ఐలాండ్‌లో పర్యాటకుల కోసం విడిది భవనాలు ఏర్పాటు చేస్తే టూరిజం పరంగా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



మాజీ మంత్రి సీ. లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు

మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి పలువురి పరామర్శ

- శ్వేతారెడ్డికి నివాళులర్పించిన కేటీఆర్, హరీశ్‌రావు

తిమ్మాజీపేట, సెప్టెంబరు 19: నాగర్‌కర్నూలు జిల్లా తిమ్మాజీపేట మండల పరిధిలోని ఆవంచలో గ్రామంలో నిర్వహించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి ఏకాదశ దినకర్మలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే. తారక రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావులు పాల్గొన్నారు. శ్వేతారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి లక్ష్మారెడ్డిని పరామర్శించారు. ధైర్యాన్ని కోల్పోవద్దని, ఆమె ఆశయ సాధనే ధ్యేయంగా ముందుకు సాగి ప్రజాసేవలో నిమగ్నం కావాలన్నారు. లక్ష్మారెడ్డిని పరామర్శించిన వారిలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ స్థానిక నాయకులు ఉన్నారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబరు 19: ఇంటింటి సర్వేను పకడ్బందీగా గడువులోగా పూర్తి చేసి, ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఓటరు జాబితా సవరణ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ముందుగా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ జిల్లాలో 835 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది మే 25 నాటికి 7,21,784 మంది ఓటర్లు ఉన్నారని, ప్రస్తుతం 10,07,986 మంది ఉన్నారని తెలిపారు. ప్రతీ బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటర్ జాబితాలో చేయవలసిన మార్పులు, చేర్పులపై చర్చించి తగుచర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో ఒకరి ఫొటో మరొకరి ఓటర్ కార్డులో వచ్చిన, ఫొటోలు మసకగా ఉన్న వాటి స్థానంలో వారి దగ్గర నుంచి మంచి ఫొటోను తీసుకొని అప్‌లోడ్ చేయాలని, పేరు, అడ్రస్ వంటి సవరణ, మరణించిన వారి డెత్ సర్టిఫికెట్ పరిశీలించి ఓటరు జాబితా నుంచి తొలిగించాలని సూచించారు. ఓటరు నివసిస్తున్న ప్రాంతంలోనే ఓటు వేసే విధంగా సరిచేయాలని అన్నారు. ఒకే వ్యక్తికి రెండు ఓటరు కార్డులు ఉంటే వారిని సంప్రదించి ఒకటి తొలిగించాలని సూచించారు. 2025 జనవరి 1వ తేదీ వరకు 18 సంవత్సరాలు దాటే వారి వివరాలను సేకరించాలని, ప్రస్తుతం 18 సంవత్సరాలు దాటిన వారు ఎవరైనా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని బీఎల్‌వోలకు సూచించారు. జిల్లాలో ఓటర్ జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నతీరు బాగుందని తెలిపారు. అనంతరం మూడు నియోజకవర్గాల అసిస్టెంట్ ఎలక్షన్ అధికారులు మాట్లాడుతూ ఇంటింటి సర్వే చేయుటకు బీఎల్‌వోలకు రిజిస్టర్లు ఇచ్చామని, ఎవరైనా ఇళ్లు మారే క్రమంలో వారు మారిన చోటుకు ఓటును మార్చుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదామును పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్. మోహన్‌రావ్, స్పెషల్ కలెక్టర్ ముందరెడ్డి, ఆర్డీవో నవీన్, ఈఆర్‌వోలు, బీఎల్వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భీమా నీటి కోసం ఎదురు చూపులు

ప్రతిపాదనలు పంపించాం



భీమా కాల్వకు గండ్లు పడ్డ ప్రాంతంలో మరమ్మతులు చేసేందుకు రూ.1.28 కోట్లు అవసరమవుతుందని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను పంపాము. ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి మరమ్మతులు చేయిస్తాం.

- కేశవరావు, భీమా ఈఈ

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి



భీమా కాలువకు పడిన గండ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. అధికారుల నిర్లక్ష్యం వల్లన పంటలు ఎండుతున్నాయి. దీంతో రైతులు అప్పులపాలయ్యే ప్రమాదం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి సాగునీరు విడుదల చేయాలి.

- బాల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి

పంటలు ఎండిపోతాయి..



వర్షాలకు గండ్లపడ్డ కాలువలను మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలి. గండ్లు పడి 20 రోజులైనా మరమ్మతులు చేపట్టలేదు. సాగునీరు అందక పంటలు దెబ్బ తింటున్నాయి. పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి.

- కురువ వెంకటయ్య, రైతు

- కాల్వ గండ్లకు మరమ్మతులు చేయించని అధికారులు
- నిలిచిపోయిన సాగునీటి సరఫరా
- ఎండుతున్న పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు

వీపనగండ్ల, సెప్టెంబరు 19 : భీమా నీటికోసం రైతులు ఎదురు చూస్తున్నారు. భారీ వర్షాలకు వనపర్తి జిల్లాలో భీమా కాల్వకు 12 చోట్ల గండ్లు పడ్డాయి. 16వ ప్యాకేజీలో వీపనగండ్ల-కల్వరాల మధ్య ఒకచోట, పుల్గర్‌చర్ల సమీపంలో మరోచోట, 19వ ప్యాకేజీలో ఒకచోట, 27వ ప్యాకేజీలో తొమ్మిది చోట్ల గండ్లు పడ్డాయి. అంతేకాకుండా కాల్వ ఎక్కి నీరు పారి కొంత మేర కోతకు గురైన సంఘటనలు ఉన్నాయి. గండ్లు పూడ్చి పంటలకు సాగునీరు అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు గండ్లుపడిన కాల్వకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి సాగునీరు అందించాలని కోరుతున్నారు. వారంలో పంటలకు నీరందకపోతే పూర్తిగా ఎండిపోయి తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

16,660 ఎకరాల సాగు..

జిల్లాలోని భీమా కాల్వ కింద 16,660 ఎకరాలలో వరి సాగు చేశారు. వీపనగండ్ల మండలంలో 8,611 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. భారీ వర్షాలకు 20 రోజుల క్రితం కాల్వలకు గండ్లుపడి పెబ్బేరు, పాన్‌గల్, వీపనగండ్ల, శ్రీరంగాపూర్ ప్రాంతంలోని ఆయకట్టుకు సాగు నీరు అందటం లేదు. దీంతో సాగు చేసిన వరి, వేరుశనగ తదితర పంటల ఎండుదశలో ఉన్నాయి. సాగునీటి సరఫరా చేయకపోవడం, ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పంటలు ఎండు ముఖం పట్టాయి. వరి మడులు నెర్రెలు బారాయి. త్వరలో సాగునీరు అందించకపోతే అప్పులపాలవుతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.



నీరందక పగుళ్లు వచ్చిన వరి పంట పొలం



వీపనగండ్ల-కల్వరాల మధ్య మరమ్మతులకు నోచుకోని భీమా కాలువ గండి

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 19 : రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మరికల్ మండలం జిన్నారం చెందిన ఆటోడ్రైవర్ రవి (36) తన ఆటోలో గురువారం తెల్లవారుజామున తన అత్త అనారోగ్యంతో ఉండటంతో ఆమెను చూసి వచ్చేందుకు మహబూబ్‌నగర్‌కు బయలుదేరాడు. దేవరకద్ర వద్ద ఓ ప్రయాణికుడిని ఎక్కించుకుని ఇద్దరూ వెళ్తుండగా, ధర్మాపూర్ సమీపంలో వీరి ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రవికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, ప్రయాణికుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతుడి భార్య లలిత రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలయ పూజారిని విధుల నుంచి తొలగించాలి



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మక్తల్, సెప్టెంబరు 19 : ఆలయ పూజారి చక్రపాణిని వెంటనే విధుల నుంచి తొలగించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం నారాయణపేట జిల్లా క్రిష్ణ మండలంలోని ముడుమాల్ గ్రామ రైతు వేదికలో దళితులతో సమావేశమయ్యారు. ముడుమాల్‌లోని యాదవేంద్రస్వామి ఆలయంలో తమకు జరిగిన అవమానం గురించి కమిషన్ సభ్యులకు బాధితులు వివరించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ గత నెల 18న గ్రామానికి చెందిన దళిత కుటుంబ సభ్యులు ఓబులేష్, పద్మావతి ఇరు కుటుంబాల సభ్యులు యాదవేంద్రస్వామి ఆలయంలో పెళ్లి చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. పూజారి చక్రపాణి ఆలయానికి తాళం వేసి ఆలయం బయట పెళ్లి చేసుకోవాలని, లేదంటే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పడం క్షమించరాని నేరం అన్నారు. ఈ సంఘటన దళితులకే కాదు ముడుమాల్ గ్రామానికే అవమానం అన్నారు. భారత దేశ చట్టాలను తుంగలో తొక్కేలా వ్యవహరించిన చక్రపాణిని శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు మహనీయుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం యాదవేంద్రస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు రాంబాబునాయక్, శంకర్, అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో మధుమోహన్, డీఎస్పీ, సీఐ చంద్రశేఖర్, తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, ఎంపీడీవో జానయ్య, వివిధ శాఖల అధికారులు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ సమీర్ అరాచకాలు అరికట్టాలి

- న్యూలైఫ్ ఆసుపత్రిని సీజ్ చేయాలని ధర్నా



ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు

నాగర్‌కర్నూల్, (ఆంధ్రజ్యోతి)/కందనూలు, సెప్టెంబరు 19 : కీచక ఆర్‌ఎంపీ సమీర్ అరాచకాలను అరికట్టి ఆయన నిర్వహిస్తున్న ఆసుపత్రిని సీజ్ చేయాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆసుపత్రి ముందు గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బుధవారం సాయంత్రం నాగర్‌కర్నూలు జిల్లా తాడూరు మండలం యత్మతాపూర్ గ్రామానికి చెందిన వివాహిత జ్వరం వచ్చిందని తన తల్లితో పాటు వైద్యం కోసం ఆసుపత్రికి రాగా ఆర్‌ఎంపీ సమీర్ పరీక్షించేందుకు వచ్చి ఎంతమంది పిల్లలు అని అడిగి, పిల్లలు కాలేదని చెప్పడంతో, వివాహమై ఎన్ని ఏళ్లు అయ్యిందని అడిగాడు. ఏడేళ్లు అయ్యిందని మహిళ చెప్పింది. నీ భర్త ద్వారా నీకు పిల్లలు పుట్టరని మూడు నెలల పాటు తన ఆసుపత్రిలో ఉంటే తనతో పాటు మరో ముగ్గురు తన స్నేహితులు వస్తుంటారని వారితో నువ్వు సక్యతగా ఉంటే మూడు నెలల్లో గర్భం దాలుస్తావని ఆర్‌ఎంపీ చెప్పాడు. దీంతో బాధిత మహిళ, ఆమె తల్లి ఆయన ప్రవర్తనను ప్రశ్నించడంతో అతను అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయాన్ని బాధితురాలు తన భర్త, బంధువులకు తెలియజేసింది. దీంతో ఆర్‌ఎంపీ తాడూరు మండలానికి చెందిన ఇద్దరు మాజీ ప్రజాప్రతినిధులతో తన ఫామ్‌హౌజ్‌కు పిలిపించుకొని బేరసారాలు మొదలుపెట్టాడు. బాధిత మహిళ వారి ప్రలోభాలకు లొంగలేదు. దీంతో సదరు బాధితురాలి తో పాటు రెడ్డి సేవా సమితితోపాటు మహిళా సంఘాలు, వివిధ రాజకీయ పక్షాల నాయకులతో కలిసి వేర్వేరుగా సీఐ కనకయ్యకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆసుపత్రిని సీజ్ చేసి, ఆర్‌ఎంపీని శిక్షించాలని ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కలెక్టర్ వచ్చే వరకు తాము ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ ఆందోళన చేయడంతో సీఐ కనకయ్య సంఘటనా స్థలానికి వచ్చి డీఎంహెచ్‌వో సూచన మేరకు ఆసుపత్రిని సీజ్ చేశారు. ఆర్‌ఎంపీ వైద్యుడు సమీర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమాదేవి తెలిపారు.

పాల బిల్లులు చెల్లించాలి

- శ్రీశైలం ప్రధాన రహదారిపై పాడి రైతుల రాస్తారోకో
- రోడ్డు పొడవునా నిలిచిన వాహనాలు
- ఇబ్బంది పడిన ప్రయాణికులు
- పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించిన రైతులు



రాస్తారోకో చేస్తున్న పాడి రైతులు

వెల్దండ, సెప్టెంబరు 19 : పాల బిల్లులు చెల్లించాలని పాడి రైతులు పాల క్యాన్‌లతో ఆందోళనకు దిగారు. విజయ డెయిరీ కేంద్రాలలో పాలు పోసిన వారికి ఐదు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రాస్తారోకో విరమించాలని సూచించడంతో ఆగ్రహించిన రైతులు క్యాన్లలో ఉన్న పాలను రోడ్డుపై పారబోశారు. నెలల తరబడి బిల్లులు ఇవ్వకపోతే తాము కుటుంబాలను, పశువులను ఎలా పోషించుకోవాలని వాగ్వాదానికి దిగారు. కేవలం పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు తక్షణమే చెల్లించకపోతే ఆమరణ దీక్ష చేపడుతామని హెచ్చరించారు. పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎనుముల రాజేందర్‌రెడ్డి, పాలసేకరణ కేంద్రం చైర్మన్ ఎండీ యాఖూబ్, నాయకులు యెన్నం విజేందర్‌రెడ్డి, రంగయ్య, నిరంజన్, శ్రీశైలం, జనార్దన్, మల్లేష్, దేవేందర్, మల్లేష్ రైతులు ఉన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

నవాబ్‌పేట, సెప్టెంబరు 19: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు (14, 17) సంవత్సరాలలోపు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఈనెల 21 నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రాజునాయక్, నోడల్ అధికారి నాగ్యనాయక్ గురువారం తెలిపారు.

జనవరి 1, 2008 నుంచి జనవరి 1, 2011 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు తమ పిల్లలు పోటీల్లో పాల్గొనేలా చూడాలని ఎంఈఓ కోరారు.

నేడు ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో పర్యటించనున్న ఉప ముఖ్యమంత్రి



టన్నెల్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 19: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల ంలోని మన్నెవారి పల్లి, నక్కలగండి ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పర్యటించనున్నారు. టన్నెల్ వద్ద ఏర్పాట్లను గుర ువారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కృషితో పనులు వేగంగా కొనసా గుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్, కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పలువురు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

పురుగుల మందు తాగిన యువకుడు

గండీడ్, సెప్టెంబరు 19 : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని జంగంరెడ్డిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటయ్య గురువారం గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన గ్రామస్తులు చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించడం తరలించారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



పెద్దకొత్తపల్లిలో ఆటపాటలతో విరాళాలు సేకరిస్తున్న కళాకారులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 19 : ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులు, చిరు వ్యాపారులు, ఇల్లు కోల్పోయిన బాధితు లకు ఆర్థికంగా అండగా నిలవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర నిరుద్యోగ కళాకారుల సంఘం పిలుపు మేరకు గురువారం విరాళాల సేకరణకు శ్రీకారం చుట్టారు. క ళాకారులు ఆటపాటలతో నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో వివిధ వ్యాపారవర్గాల నుంచి రూ.12,500 నిధులను సేకరించారు. జిల్లా అధ్యక్షు డు తుపాకుల వెంకటేష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా రూ.30వే ల విరాళాలను సేకరించి ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపిస్తామని చెప్పారు. మద్దెల అర్జున్, తగిలి రామచందర్, నరసింహ, శంకర్, విజయలక్ష్మి, శ్రావణ్, మహేష్, రామకృష్ణ, శ్రీకాంత్, నాగరాజు, హుస్సేన్, కేశవులు, హుసేన్‌గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

చెంచుల స్థితిగతులపై ఆరా



చెంచులతో మాట్లాడుతున్న నాయకులు

కొల్లాపూర్, సెప్టెంబరు 19 : కృష్ణానది పరివాహక ప్రాంతంలో చెంచుల స్థితిగతులపై గురువారం ఆదివాసి చెంచు కమిటీ సభ్యులు ఆరా తీశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అమరగిరి నుంచి ఆదివాసి చెంచు కమిటీ సభ్యులు గుండ్లపెంట, లింగమయ్య పెంట, వేములపాయ చెంచు పెంటల్లో ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమకు తెలిపితే.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని మాజీ ఉప సర్పంచ్ బర్మాల మల్లయ్య, ఆర్‌డీటీ సీవో రాములు, నిమ్మల శివ, బల్మూరు లింగస్వామి చెంచులతో తెలిపారు.

న్యాయం చేయాలని ప్లాట్ల బాధితుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

కల్వకుర్తిటౌన్, సెప్టెంబర్ 19 : తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్లాట్ల బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్వకుర్తి రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 736/1లోని 1.19 ఎకరాల భూమి జూపల్లికి చెందిన వ్యక్తి 2008లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంచర్ చేశాడని, అందులో 21 మంది ప్లాట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ వ్యక్తి 2024లో వెంచర్‌ను తొలగించి, మరో వ్యక్తికి ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేశాడని బాధితులు వాపోయారు. అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలని వారు కోరారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి

కల్వకుర్తి, సెప్టెంబరు 19 : ఓటర్ల ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కల్వకుర్తి ఎంపీడీవో వెంకట్రాములు కోరారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఓటర్ల ముసాయిదా జాబితా అభ్యం తరాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో గురువారం సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకట్రాములు మాట్లాడు తూ గ్రామాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగిందని, తుది జాబితాలో అభ్యంతరాలు ఏమైనా ఉంటే సమాచారమందించాలని కోరారు.

ఉప్పునుంతల: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువా రం వివిధ పార్టీల రాజకీయ నాయకులతో ఓటరు జాబితాపై ఎంపీడీవో మోహన్‌లాల్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని వార్డులలో క్రమ సంఖ్య మార్పులు చేర్పులు తప్పుఒప్పులు తదితర అంశాలపైన అవగాహన కల్పించారు. మార్పులు చేర్పులు చేసుకునే వారు పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంపీవో నారాయణ, నాయకులు అనంతరెడ్డి, రవీంద ర్ రావు, కాశన్న, నాగరాజు, శ్రీనివాసులు తదితరులున్నారు.

పథకాలను నిర్లక్ష్యం చేయొద్దు

తెలకపల్లి, సెప్టెంబరు 19 : మహిళా సంఘాల్లో ఉన్న పథకాలను నిర్లక్ష్య ం చేయవద్దని డీపీఎంఎస్ వెంకటేశ్, ఫైనాన్స్ ఐబీ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో గురువారం రెండవ కార్యవర్గ మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీపీఎంఎస్ వెంకటేష్, ఫైనాన్స్ ఐబీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తిలో భాగంగా 14పథకాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రతి స్వయం సహాయక సంఘం ప్రతీ నెల క్రమం తప్పకుండా పంచసూత్రాలు పాటిస్తూ పొదుపులు చెల్లించేలా చూడాలని, బ్యాంక్ అప్పు రికవరీ చెల్లిస్తూ ఉండాలని, తరిగి పుస్తక నిర్వహణ తనిఖీ చేస్తుండాలని సీసీలను ఆదేశించారు. బాలచమ్మ, గాయత్రి, ఏపీఎం నిరంజన్, సుజాత, సుగుణయ్య నరసింహ పాల్గొన్నారు.

భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు

- పత్తి పంటకు సోకిన ఎర్ర తెగులు
- నామమాత్రంగా పంట నష్టం అంచనా వేశారని రైతుల ఆవేదన
- పరిహారం చెల్లించాలని వేడుకోలు

మిడ్జిల్, సెప్టెంబరు 19: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు రైతులు నష్టాలపాలయ్యారు. మిడ్జిల్ మండలంలోని రైతులు పత్తి 17,800, వరి 9,700, కంది 1,200, మొక్కజొన్న 850, కూరగాయలు 270, ఆయిల్‌పాం 34 ఎకరాలలో సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. వర్షాలకు పత్తి పంటలో పెద్ద మొత్తంలో నీరు నిలిచి ఎర్రతెగులు సోకి ఆకుతో పాటు పూత రాలి, కాయలు పగులకముందే లోప పత్తి మురిగిపోయినట్లు రైతులు తెలిపారు. ఇతర గ్రామాలలో పత్తి పంటకు వచ్చిన పూత రాలిపోతుందని దీంతో పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.



మిడ్జిల్‌లో ఎర్ర తెగులు సోకిన పత్తిపంట

వందల ఎకరాలలో నష్టం

మండలంలోని పత్తి సాగు చేస్తున్న రైతులకు పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లింది. వందల ఎకరాలలో పత్తి పంట నీట మునిగి ఎర్ర తెగులు సోకింది. ఇప్పటికే గ్రామాలలోని వ్యవసాయాధికారులు పంటల నష్టం నామమాత్రంగా అంచనా వేసినట్లు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చేతికందే పరిస్థితి లేదు



వర్షానికి తాము సాగుచేసిన పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. ఆకులు, పూత, కాయలు రాలి తమకు పంట చేతికందే పరిస్థితి లేదు. అధికారులు తమకు నష్టపరిహారం అందేలా చూడాలి.

- చంద్రశేఖర్‌చారి, వెలుగొమ్ముల

రైతులను ఆదుకోవాలి



దెబ్బతిన్న పంటలను అధికారులు మొక్కుబడిగా కాకుండా పూర్తి స్థాయిలో పరిశీలించాలి. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారాన్ని అందజేయాలి.

- ఎదుల జగన్‌గౌడ్, రైతు, మిడ్జిల్

రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీలకు జట్టు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన జట్టుతో ఉపాధ్యాయులు, అధికారులు

కోయిలకొండ, సెప్టెంబరు 19 : రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి జట్టును ఎంపిక చేసినట్లు టార్గెట్ బాల్ జిల్లా కార్యదర్శి ఉమాశంకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీరామకొండ క్రీడా మైదానంలో ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి వచ్చిన క్రీడాకారులతో టార్గెట్ బాల్ పోటీలను నిర్వహించి ఇందులో గెలుపొందిన వారిని రాష్ట్ర జట్టులోకి తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. ఈనెల 22 నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపిక చేసిన జట్టు పాల్గొంటారని వెల్లడించారు. శ్రీకాంత్, గంగాధర్‌రెడ్డి, పీఈటీలు శ్రీనివాస్, వీరయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



రాజా వెంకట్ (ఫైల్)

దేవరకద్ర, సెప్టంబరు19: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. పెద్దరాజామూర్ చెందిన చాకలి రాజా వెంకట్ (24) కారు నడుపుతూ జీవనం సాగించేవాడు. ఇతని తండ్రి హైదరాబాద్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్ గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలో వ్యవసాయ పనుల కోసం తండ్రి రాగా, అతని స్థానంలో యువకుడు వాచ్‌మన్‌గా పనిచేసేవాడు. ఇదే సమయంలో హైదరాబాద్‌లో యువకుడికి ఓ మహిళ పరిచయమై ఇద్దరు తరుచుగా ఫోన్లలో మాట్లాడుకునేవారు. ఈ విషయం మహిళ భర్తకు తెలియగా మందలించాడు. ఈ విషయంలో తన తల్లిదండ్రులకు తెలుస్తోందని భయంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయంలో విచారించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

ఎర్రవల్లి, సెప్టెంబర్ 19 : పురుగుల మందు సేవించి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్‌ఐ స్వాతి తెలిపిన వివరాల ప్రకారం.. పుటాన్‌దొడ్డికి చెందిన గొల్ల లింగన్న (54) కల్లుకు బానిసై అదేమత్తులో పురుగుల మందు సేవించినట్లు తెలిపారు. భార్య గొల్ల లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఊర్కొండలో మరో యువకుడు..



పసుల కృష్ణారెడ్డి (ఫైల్)

ఊర్కొండ, సెప్టెంబరు 19: ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం గుడిగానిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పసుల కృష్ణారెడ్డి (32) వృత్తిరీత్యా వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, కారణాలు తెలియాల్సి ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు.

నర్సంపల్లిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు



శివాలయం వద్ద గుంతలు తీసిన ఆనవాళ్లు

వంగూరు, సెప్టెంబరు 19: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని సర్వారెడ్డిపల్లి పంచాయతీలోని నర్సంపల్లిలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధులకోసం శివాలయం వద్ద తవ్వకాలు చేశారు. గ్రామానికి కొద్ది దూరాన పురాతన శివాల యం ఉంది. ఆవరణంలో నిమ్మ, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు పెట్టి కొద్దిలోతు గుంతలు తవ్వారు. ఉదయం సమీపంలోని రైతులు విషయాన్ని తెలుసుకొని గ్రామస్థులకు తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. గుప్త నిధుల కోసం గోతులు తవ్విన వారిని పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

మునిసిపల్ కమిషనర్ వేధింపులు ఆపాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 19 : వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని సంజీవ్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న దళితుడు లింగన్న కుటుంబంపై మునిసిపల్ కమిషనర్ వేధింపులు ఆపాలని వామపక్ష పార్టీలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ.. 40 ఏళ్ల క్రితం నుండి హోలియా దాసరి కుటుంబానికి చెందిన లింగన్న కాలనీలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. ఇటీవల వెంచర్ ఏర్పాటు చేయడంతో ఆ స్థలం తమదని, కొందరు మునిసిపల్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయడంతో కమిషనర్ తక్షణమే నివాసం ఉంటున్న గుడిసె స్థలాన్ని ఖాళీ చేయాలని సిబ్బందితో వేధిస్తున్నట్లు తెలిపారు. నాలుగు దశాబ్దాల నుంచి అక్కడే నివాసం ఉండగా, ప్రస్తుతం ఖాళీ చేయాలని వేధించడం సరైనది కాదన్నారు. దళితుడైన లింగన్నకు అదే స్థలంలో అనుమతులు ఇచ్చి ఇంటి నిర్మాణం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో సోంబాబు, మాసన్న, జానకి రాములు, అజయ్, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవీందర్, సీపీఐ మండల కార్యదర్శి రాబర్ట్, సీపీఎం మండల కార్యదర్శి రాజు, కృష్ణ, జహంగీర్, రాము పలువురు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

అడ్డాకుల, సెప్టెంబరు 19 : ప్రభుత్వం నిర్దేశించినట్లు అందరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అడ్డాకుల ఎస్‌ఐ శ్రీనివాసులు, వెస్ట్రర్న్ టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ దీపీ మదియాలు పేర్కొన్నారు. గురువారం అడ్డాకుల జూనియర్ కాలేజీలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మైనర్లుగా ఉన్న విద్యార్థులు వాహనాలు నడుపరాదని, మేజర్లు అతివేగం, నిర్లక్ష్యంతో వాహనాలు నడి పి ప్రమాదాలు కొనితెచ్చుకొని ప్రమాదాలకు గురై కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని మిగిల్చికూడదని అన్నారు. రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేయరాదని, హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆపరేషన్ మేనేజరు సంతోష్ కుమార్, రూట్ ఆఫీసర్ తేజస్వరూప్, మద్దూరి సురేందర్‌రెడ్డి, అమీర్, ఆర్‌పీవో కురుమూర్తి, కళాశాల అధ్యాపకులు, రూట్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలేపల్లి సెజ్‌లో కాలుష్యంపై పరిశీలన



పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం నీటిని పరిశీలిస్తున్న అధికారులు

జడ్చర్ల, సెప్టెంబరు 19 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని పోలేపల్లి సెజ్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంపై గురువారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సురేష్, ఏఈ విద్యులత తనిఖీ చేపట్టారు. సెజ్‌లోని పరిశ్రమల సమీపంలో కూలిన టీఎస్‌ఐఐసీ ప్రహరీని పరిశీలించారు. ఆ ప్రాంతం గుండా పరిశ్రమల నుంచి కాలుష్యం నీరు బయటికి వస్తున్న తీరును గమనించారు. అలాగే సెజ్‌లో నుంచి ప్రహరీ వరకు నిర్మించిన పైపులైనును, ఆ పైపులైనులో నుంచి కాలుష్య నీరును వదులుతున్న తీరును పరిశీలించారు. ప్రహరీకి ఆనుకుని ఉన్న వ్యవసాయ పొలాల్లోకి కాలుష్యం నీరు రావడంతో పొలాలలో పంటలు పండించుకోలేని దుస్థితి ఏర్పడిందంటూ కొందరు రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సెజ్‌లోని ఫార్మా పరిశ్రమల నుంచి కాలుష్య నీరు వచ్చే ప్రాంతాలను అధికారులకు రైతులు చూపించారు. కాలుష్యం బారిన పంట పొలాలు పూర్తిగా నష్టపోయిన పరిస్థితిని పరిశీలించేందుకు పొల్యూసన్ కంట్రోల్ బోర్డు అధికారులు వచ్చారన్న సమాచారం తెలుసుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఈ సందర్భంగా వారితో ఫోన్‌లో మాట్లాడారు. రైతుల పక్షాన అధికారులు ఉండాలని, ఫార్మా పరిశ్రమలకు వత్తాసు పలకవద్దని కోరారు. కాలుష్యాన్ని వదులుతున్న పరిశ్రమలపై లీగల్‌గా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు రావడం, తనిఖీలు నిర్వహించడం, ఎలాంటి కాలుష్యం లేదంటూ నివేదికలు ఇవ్వడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి, రైతులకు న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఎమ్మెల్యే కోరారు. పంట, పొలాలను పరిశీలించిన అనంతరం సెజ్‌లో నుంచి కాలుష్యం నీరు వదులుతున్న తీరును తనిఖీ చేసేందుకు ఫార్మా పరిశ్రమలను పరిశీలించారు.

కేఎల్‌ఐ పనులను వెంటనే పూర్తి చేయండి



వెల్దండలో కేఎల్‌ఐ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అధికారులు

వెల్దండ, సెప్టెంబరు 19 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గ రైతులకు సాగునీరందించే కేఎల్‌ఐ కాలువ అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వెల్దండ మండల కేంద్రం సమీపంలోని లక్ష్మాపురం వద్ద కేఎల్‌ఐ కాలువను ఆయన స్థానిక నాయకులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాలువ వెంట అవసరమైన కల్వర్టుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపి వాటిని పూర్తి చేయాలన్నారు. రైతులు సైతం కాలువలో సాగునీరు ప్రవహించేలా సహకరించాలని, గండ్లు కొట్టరాదని కోరారు. అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈ శ్రీకాంత్, డీఈలు దేవన్న, రాఘవేందర్, ప్రాజెక్టు మేనేజర్ వెంకట్‌రావు, నాయకులు యెన్నం భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, మోతీలాల్, జయప్రకాష్, పర్వత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనుయాదవ్, అలీ, పుల్లయ్య, బక్యనాయక్ తదితరులు ఉన్నారు.

బాలానగర్‌లో వ్యక్తి దారుణ హత్య

- క్లూస్ టీంతో పరిశీలించిన పోలీసులు



పర్వతాలు (ఫైల్)

బాలాగనర్, సెప్టెంబరు 19: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని పెద్దాయపల్లి చౌరస్తాలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి చెందిన సంపంగి పర్వతాలు (38) బుధ వారం రాత్రి ఓ వెంచర్‌లో హత్యకు గురై నిర్జీవంగా ఉన్నాడని తెలిపారు. పర్వాతాలుకు స్నేహితులతో ఉన్న శతృత్వమే హత్యకు కారణమై ఉండొచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆదేవిధంగా మృతుడి భార్య అనసూయ సైతం పలువురిపై బాహటంగానే ఆరోపణలు చేసింది. హత్యకు గురైన ప్రదేశాన్ని క్లూస్‌టీంతో పోలీసులు పరిశీలించారు. గురువారం ఉదయం మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపాజి వెల్లడించారు. సమగ్ర విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ పేర్కొన్నారు.



ఘటనా స్థలం వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ జానకి, సిబ్బంది

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ



మాట్లాడుతున్న మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 19 : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారా యణ హెచ్చరించారు. ఈ సందర్భంగా నారాయణ పేట జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీలు యోగేష్ గౌతమ్, గైక్వాడ్ వైభవ్, వెంకటేశ్వర్లుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని, మిలాద్ ఉన్ నబీ సందర్భంగా బుధవారం సాయం త్రం జెండాలు కట్టే విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడి రాళ్లు విసురుకోవడం వంటివి జరిగిన వెంటనే ఎస్పీ యోగేష్ గౌతమ్ వెంటనే స్పందించి ఆందోళ నకారులను చెదరగొట్టారన్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో శాంతియుత వాతావరణం ఉందన్నారు. ముందుగా జిల్లా కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిన్నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన 20 మందికి పైగా గుర్తించడం జరిగిందని, వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చట్టాన్ని ఎవరూ ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదన్నారు. నారాయణపేటలో శాంతియుత వాతావరణం కోసం ఇరువర్గాల వారు సహకరించాలని కోరారు.

మీ ఇంట్లో ఇలాగే తింటారా?

- పిల్లల బాధ్యత మీదే.. సదుపాయాలు మేం కల్పిస్తాం
- కేజీబీవీని తనిఖీ చేసిన జడ్పీ సీఈవో లక్ష్మీకాంతమ్మ



తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో లక్ష్మీకాంతమ్మ

మానవపాడు, సెప్టెంబర్ 19: మెనూ ప్రకారం భోజనం ఎందుకు లేదని, రుచిలేకుండా వంటలు చేస్తే ఏవిధంగా తింటారని, మీ ఇళ్ల దగ్గర ఇలానే చేసుకుని తింటారా అని జడ్పీ సీఈవో లక్ష్మీకాంతమ్మ కేజీబీవీ సిబ్బందిపై మండిపడ్డారు. గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రంలోని కేజీబీవీని జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కస్తూర్బా పాఠశాల ఏర్పాటు చేసిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, పరిసరాలు, విద్యార్థినులకు కల్పించే సదుపాయాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి మెనూ ప్రకారం భోజనం అందించి, చదువులు చెప్పాలన్నారు. ఏమైనా సమస్యలుంటే ఉన్నత స్థాయి అధికారులకు తెలిపితే పరిష్కరిస్తామని అన్నారు. గురువారంకి సంబంధించిన మెనూ ప్రకారం భోజనం ఎందుకు లేదని, మీ ఇళ్ల దగ్గర ఈవిధంగా చేసుకుని తింటారా అని మండిపడ్డారు. ప్రతి రోజు తాగునీటి ట్యాంకులు శుభ్రంగా ఉంచాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీవో భాస్కర్, పంచాయితీ కార్యదర్శి శివశంకర్ తదితరులు ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

-కేసు నమోదు

రాజాపూర్, సెప్టెంబరు 19: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి బ్లూకోర్టు సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, కానిస్టేబుల్ గౌస్ ఇసుక లోడ్‌తో ఉన్న టిప్పర్‌ను పట్టుకున్నారు. ఇసుకకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్, టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఉప్పునుంతల, సెప్టెంబరు 19: నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని పెద్దాపూర్‌లో గురువారం తోళ్ల రాములు చెందిన ఎద్దు పొలంలో వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు ధర సుమారు రూ.70వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

భార్యాభర్తలపై దాడి: కేసు నమోదు

నవాబ్‌పేట, సెప్టెంబరు 19 : పాత గొడవలు మనసులో పెట్టుకుని దాడిచేసి గాయపరిచినట్లు ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రం గురువారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కిషన్‌గూడ చెందిన కలిమి మంజూల, భర్త బాలయ్యను ఈనెల 16న దాయాదులు అంజయ్య కుమారులు రాము, లక్ష్మణ్ అకారణంగా దూషిస్తూ దాడి చేశారని, అడ్డువచ్చిన కేశవులును సైతం కొట్టారని తెలిపారు. గాయాలపాలై జిల్లా ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారని, ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జడ్చర్లలో యువకుడి అదృశ్యం

జడ్చర్ల, సెప్టెంబరు 19 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మహేష్ కనిపించడం లేదంటూ తల్లి ఇందుమతి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. పెయింటర్‌గా పనిచేస్తున్న మహేష్ ఫిబ్రవరిలో ఇంట్లో గొడవపడి వెళ్లిపోయాడని, నాటి నుంచి వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేసిందని వివరించారు. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలేపల్లిలో యువతి..

జడ్చర్ల మండలం పోలేపల్లికి చెందిన కందూరిరాజేశ్వరి కనిపించడం లేదంటూ తల్లి మొగులమ్మ ఫిర్యాదు చేసిందని సీఐ ఆదిరెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులంతా భోజనం చేసిన అనంతరం నిద్రించిన ఆమె, గురువారం ఉదయం 6గంటల ప్రాంతంలో చూడగా కనిపించలేదని తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

21న కురుమూర్తి ఆలయంలో జాతర వేలం

చిన్నచింతకుంట, సెప్టెంబరు 19 : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. నేపథ్యంలో జాతరతో పాటుగా ఏడాది పాటు ఆలయ ఆవరణలో విక్రయించే లడ్డు, పులిహోర, ప్రసాదం విక్రయించుట, తలనీలాలు సేకరించేందుకు హక్కులకు సంబంధించి బహిరంగ వేలం ఈనెల 21న కార్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఈవో మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆసక్తిగల వారు రూ.5లక్షల డీడీ రూపంలో కట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

శాంతిస్వామి మఠం గుడిసె దగ్ధం



కాలిపోతున్న మఠం గుడిసె

కేటీదొడ్డి, సెప్టెంబరు 19: విద్యుదాఘాతంతో శాంతిస్వామి మఠం గుడిసె దగ్ధమైన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మండలంలోని ఇర్కిచేడులో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలో ఉన్న శాంతిస్వామి మఠం గుడిసె గురువారం సాయంత్రం విద్యుదాఘాతంతో పూర్తిగా కాలిపోయిందన్నారు. చుట్టుపక్కల వ్యవసాయ పనులు చేసుకుంటున్న రైతులు గమనించి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో గుడిసెలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం కాలేదని, గుడిసెలో ఉన్న రూ.2లక్షలు విలువ చేసే మఠం సామగ్రి పూర్తిగా కాలిపోయిందని తెలిపారు.

మహిళకు పాము కాటు

గండీడ్, సెప్టెంబరు 19 : మహిళ పాము కాటుకు గురైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని జంగంరెడ్డిపల్లి శివారులో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగంరెడ్డిపల్లి చెందిన బాలమణి గురువారం పొలంలో జొన్న చేను కోస్తుండగా పాము కాటు వేసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నది.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- గ్యాస్ సబ్సిడీ ధ్రువపత్రాల పంపిణీలో ఎమ్మెల్యే జీఎంఆర్



లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర, సెప్టెంబరు 19 : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కౌకుంట్ల మండల కేంద్రంలో గురువారం గృహజ్యోతి పథకం కింద రూ.500లకే గ్యాస్ సిలిండర్ సబ్సిడీ ధ్రువపత్రాలను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతుందని, గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారులకు గ్యాస్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి అరవింద్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు కిషన్‌రావు ఉన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



హన్వాడలో కల్యాణ లక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ, సెప్టెంబరు 19 : పేదల కోసం నిరంతరం ముఖ్యమంత్రి పని చేస్తున్నారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో హన్వాడ మండలానికి చెందిన 28 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మాది ప్రజా ప్రభుత్వమని, మా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి తట్టుకోలేక ప్రతిపక్షం జీర్ణించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎన్‌పీ వెంకటేష్, ఎం.సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్, కృష్ణయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 19 : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి యత్నిస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక పారిశ్రామికవాడలోని ఫోరం కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ఆహారభద్రత కార్డు, వృద్ధాప్యపెన్షన్, హెల్త్ కార్డులు మంజూరు చేయడానికి విధాన పరమైన అంశాలను, విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు తదితర అంశాలపై సీఎం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ల దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. అంతకుముందు విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డిని వారు ఘనంగా సన్మానించారు. పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

భవానీతండా, ఫతేపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

మహబూబ్‌నగర్ రూరల్,సెప్టెబర్ 19: ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని భావనితండా, ఫతేపూర్ గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనుల ప్రారంభించారు. భవానితండాలో రూ.5లక్షలతో వేసిన సీసీరోడ్డు, రూ.20లక్షల రూపాయలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీని ప్రారంభించారు. ఫతేపూర్‌లో సీసీ రోడ్డుకు, గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, ఎంపీడీవో కరుణ శ్రీ, పంచాయతీరాజ్ ఏఈ రాములు, మాజీ సర్పంచ్ పాండు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

భూత్పూర్, సెప్టెంబరు 19 : మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో చట్కురి నాగమ్మ, బుచ్చన్న అనే వ్యక్తులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం గ్రామంలో వారి ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సూక్ష్మ జీవుల స్వరూపంపై రంగవల్లుల పోటీలు

జడ్చర్ల, సెప్టెంబరు 19 : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం సూక్ష్మజీవుల స్వరూపం అంశంపై విద్యార్థులకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. సూక్ష్మమైన నిర్మాణం కలిగిన సూక్ష్మజీవుల రూపాలను వివిధ రంగులతో విద్యార్థులు రంగవల్లులు వేశారు. సూక్ష్మజీవుల ఆకృతి, నిర్మాణం, యోగ్యత, లోపాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య అన్నారు. రంగవల్లుల పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగాధిపతి మాధురి, అధ్యాపకులు డాక్టర్ సదాశివయ్య, నాగలక్ష్మి, లత పాల్గొన్నారు.

ఊరూరా స్వచ్ఛత కార్యక్రమాలు

భూత్పూర్, సెప్టెంబరు 19 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలలో భాగంగా గురువారం మండలంలోని చాలా గ్రామాల్లో గ్రామస్థులు, యువకులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టనున్నారు. మండలంలోని పోతులమడుగు, అన్నాసాగర్, హస్నాపూర్, శేరిపల్లి, కొత్తమొల్గర, పాత మొల్గర, వెల్కిచర్ల, తాటిపర్తి, తాటికొండ తదితర గ్రామాల్లో విద్యార్థులచే ర్యాలీ, యువకులు, గ్రామస్థులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ. లక్షకు వినాయక లడ్డూ వేలం

హన్వాడ, సెప్టెంబరు 19 : మండలంలోని ఇబ్రహీంబాద్ గ్రామంలో గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూను గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి టీం లక్ష రూపాయలకు వేలం పాట పాడి దక్కించుకున్నారు. బుధవారం రాత్రి వినాయకుడి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి టీం సభ్యులు కుర్మయ్యగౌడ్, ఆనంద్‌గౌడ్, రామంజగౌడ్, రాజు, కృష్ణయ్యగౌడ్, వంశీగౌడ్, రమేష్‌గౌడ్, రాముగౌడ్, రామచంద్రయ్యగౌడ్, యాదయ్యలు లక్ష రుపాయలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ నిమజ్జనం గురువారం ఉదయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, యువకులు పాల్గొన్నారు.

విజయోత్సవ సభను జయప్రదం చేయాలి

హన్వాడ. సెప్టెంబరు 19 : ఈ నెల 21న నారాయణపేట జిల్లా మరికల్‌లో నిర్వహించే టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర విజయోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజు కోరారు. గురువారం చిన్న దర్పల్లి గ్రామంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు జంగయ్య, నాయకులు మధు, నర్సిములు, రామకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు

- న్యూ బ్రిలియంట్ గ్రామర్ పాఠశాలను పరిశీలించిన ఎంఈవో

మహమ్మదాబాద్, సెప్టెంబరు 19 : ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని ఎంఈవో వెంకటయ్య తెలిపారు. మండల కేంద్రంలోని కంచింపలి గేట్ దగ్గర ఉన్న న్యూ బ్రిలియంట్ పాఠశాలను ఆయన గురువారం పరిశీలించారు. ఆ పాఠశాలకు గతంలో విద్యాశాఖ 1 నుంచి 7వ తరగతి వరకు మాత్రమే అనుమతి ఇచ్చిందని, నిబంధనలు పాటించకుండా ఎనిమిదో తరగతి కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ - తాండూర్ జాతీయ రహదారికి ఆనుకుని ఉందని, దీన్ని మార్చాలని గతంలో నోటీసులు ఇచ్చినా ఇప్పటి వరకు మార్చలేదన్నారు. దీనిపై ఇప్పటికే గ్రామస్థులు డీఈవో, ఆర్జేడీలకు ఫిర్యాదు చేశారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేసినట్లు ఎంఈవో చెప్పారు. తాను పరిశీలించిన అంశాలపై నివేదికను డీఈవో రవీందర్‌కు అందజేస్తానని వివరించారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

బాలానగర్, సెప్టెంబరు 19: పీఆర్‌టీయూ తెలంగాణ మండల కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శివానందరావు, ప్రధాన కార్యదర్శిగా హీరలాల్‌లను సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యామ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమాకాంత్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీ బోధనా సిబ్బంది అభ్యర్థుల పత్రాల పరిశీలన పూర్తి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 19 : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలల్లో గల బోధనా సిబ్బందిని గురువారం జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో 1:3 ప్రకారం పిలిచి ధ్రువప్రతాలను పరిశీలించారు. 14 పోస్టులకు గాను 40 మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో రవీందర్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు ఆయన తెలిపారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే శుక్ర వారం రెండు గంటలలోపు విద్యాశాఖ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ బైకాని బాలు యాదవ్, దుంకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీతాఫలాల సేకరణకు 23న వేలం

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 19 : మహబూబ్ నగర్ మండలం అటవీ జిల్లా పరిధిలో సీతాఫలాల సేకరణకు ఈ నెల 23న డివిజన్ కాంప్లెక్స్‌లో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా అటవీ అధికారి సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ రేంజ్ పరిధిలో 2024 సంవత్సరానికి సీతాఫలాలు సేకరించేందుకు ఆసక్తి కల పట్టాదారులు రూ.5000 ధరావత్తు చెల్లించి, వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు మహబూబ్‌నగర్‌లోని అటవీ శాఖ కార్యాలయం సంప్రదించాలని సూచించారు.

'సెకండ్ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలి'

మహమ్మదాబాద్, సెప్టెంబరు 19 : సెకండ్ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సందర్శించి రెండో ఏఎన్ఎంల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంకడ్ ఏఎన్ఎంలు వైద్య ఆరోగ్య రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని, గ్రామ గ్రామాన రేయింబవళ్లు శ్రమిస్తూ ప్రజలకు ఆరోగ్య శాఖ వారధిగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండవ ఏఎన్ఎంలు గిరిజారెడ్డి, కొండమ్మ, నిర్మల, కవిత, శోభ పాల్గొన్నారు.

రైతు ఆదాయం పెంచటమే లక్ష్యం

- మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో మంత్రి జూపల్లి

పాలమూరు, సెప్టెంబరు 19 : దేశానికి అన్నంపెట్టే రైతన్న ఆదాయం పెంచటమే మార్కెట్ యార్డు లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిలతో కలిసి హాజరయ్యారు. ఎంపికైన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బెక్కరి అనితతో పాటు కమిటీ సభ్యులతో డీఎంవో బాలమణి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారిని ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ఎన్‌పీ. వెంకటేష్, మారేపల్లి సురేందర్‌రెడ్డి, బుద్దారం సుధాకర్‌రెడ్డి, సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, మాజీ టీజేఏసీ చైర్మన్ జి.రాజేందర్‌రెడ్డి, లక్ష్మణ్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిబాబా, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆదుకోవాలి

- ఎల్ఆర్ఎస్‌పై స్పష్టత ఇవ్వాలి

- రియల్ ఎస్టేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అన్సార్ హుస్సేన్

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 19 : రియల్ ఎస్టేట్ రంగం రోజురోజుకు కుదేలవుతోందని, ఈ రంగంపై ఆధారపడిన ఎంతో మంది ఉపాధిని కోల్పోతున్నారని రియల్ ఎస్టేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అన్సార్ హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకుని రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత వెంచర్‌ల ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం ఎంతో మంది ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం గతంలో ఎల్ఆర్ఎస్ కోసం రూ.10 వేలు కట్టించుకున్నదని, దీనిపై ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడం వల్ల చాలామంది ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎకరం లోపు భూములకు రిజిస్ట్రేషన్ చేయడం లేదని, పెళ్లిళ్లు, ఇంటి నిర్మాణం కోసం క్రయవిక్రయాలు చేసుకుందామన్నా రిజిస్ట్రేషన్‌లు చేయకపోవడంతో వారంతా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఒక ఎకరం పైబడిన భూములపై కన్వర్షన్ మీద రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ లేఅవుట్లకు రిజిస్ట్రేషన్ నిలిపివేయడం వల్ల సామాన్య జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అహమ్మద్ అలీ, హైదర్‌అలీ, చందూయాదవ్, రవికిరణ్, బాబునాయక్, కృష్ణయ్య, ప్రవీణ్ కుమార్, వెంకటేశ్‌గౌడ్, హరిబాబు, ఆంజనేయులు, శివారెడ్డి, భానుప్రతాప్, శ్రీనివాసులు, మహబూబ్‌అలీ, శ్రీనురాథోడ్, మ్యాకలి శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రియల్ ఎస్టేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అన్సార్ హుస్సేన్

నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రైవేటుకు అప్పగించొద్దు

- తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

పాలమూరు, సెప్టెంబరు 19 : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించరాదని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. గురువారం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. బాలు అధ్యక్షత వహించగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తిలు ప్రసంగించారు. భవన నిర్మాణ కార్మిక పథకాలపై ప్రవేశపెట్టే ఓపెన్ టెండర్ సిస్టంను రద్దు చేయాలని కోరారు. కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం ఈ నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకోవాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. వెల్ఫేర్‌బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి నిధులను దారి మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వకుండా ప్రభుత్వమే కార్మికులకు సంక్షేమ పథకాలు వెల్ఫేర్ బోర్డు నుంచి అందించాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీవీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, కోళ్ల వెంకటన్న, రాజు, కుర్మన్న, మణ్యం, గుండు, మంజుల, లబరి లక్ష్మమ్మ, కృష్ణవేణి, బాలకిష్టమ్మ, గోనెల రాములు, తిరుమలయ్య గాలెన్న, శ్రీనివాస్, ఆనంద్, నరసింహ, మదన్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

మూసాపేట, సెప్టెంబరు 19 : హైదరాబాద్‌లో కొత్త టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠత, పార్టీ బలోపేతం గురించి చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు.



మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన శెట్టి చంద్రశేఖర్

విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపట్టాలి

- ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీరా సత్యనారాయణ

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 19 : ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అత్యధిక సంఖ్యలో చేయించాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీరా సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల యాదయ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీరా సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి బలం కార్యకర్తలే నని, ప్రతీ కార్యకర్త క్షేత్రస్థాయిలో పార్టీ అభిమానులతో సభ్యత్వం చేయించాలని అన్నారు. అనంతరం పాలమూరు నగరంలో కుల సంఘం నాయకులు, వర్తక వ్యాపారుల చేత సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల యాదయ్య, నాయకులు అచ్చుగట్ల అంజయ్య, చెన్న వీరయ్య, జామ్ శ్రీనివాసులు, నాగరాజు కమలేఖర్, హరిశంకర్, ఉపాధ్యక్షులు మడుగు శివశంకర్, హన్వాడ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బాలగోపి, రాజు, హరిశంకర్, టౌన్ అధ్యక్షులు మేకల మహేష్, నర్సింహులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు సమావేశంలో నాయకులు

చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- చిల్డ్రన్స్ హోమ్‌ను పరిశీలించిన న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 19 : పట్టణంలోని స్టేట్ హోం, చిల్డ్రన్స్‌హోంలో చిన్నారులకు, బాలబాలికలకు మెరుగైన వసతులు కల్పించాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి ఇందిర అన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. గురువారం ఆమె పట్టణంలోని స్టేట్‌హోంతో పాటు శిశుగృహ, చిల్డ్రన్స్‌హోంలను పరిశీలించారు. నీరు, ఆహారం పరిశుభ్రంగా ఉండాలని, చుట్టు పక్కల ఈగలు, దోమలు రాకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బాలలను పలకరించి వారి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. పిల్లలకు సరైన ఆహారం వైద్యం అందుతుందా ? లేదా వంటి అంశాలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. స్టేట్ హోంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల హక్కుల చట్టం, లీగల్ సర్వీసెస్ చట్టం, పోక్సో చట్టం గురించి వివరించారు. న్యాయవాదులు, స్టేట్‌హోం, చిల్డ్రన్ హోం నిర్వాహకులు పాల్గొన్నారు.



చిల్డ్రన్స్ హోమ్‌లో చిన్నారులతో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

- సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల

భూత్పూర్/ మూసాపేట/ అడ్డాకుల/ నవాబ్‌పేట/ హన్వాడ, సెప్టెంబరు 19 : రూ.2లక్షల రైతు రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయడానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేపట్టిన చలో ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి వెళుతున్న నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు చేశారు. భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల, నవాబ్‌పేట, హన్వాడ మండలాల్లో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై వారిని వదిలిపెట్టారు.

● భూత్పూర్‌లో సదానందుగౌడ్, వడ్డ బ్రహ్మయ్యచారి, కృష్ణయ్యగౌడ్, తిరుపతయ్యగౌడ్, రాకేష్‌గౌడ్, జాంగీర్, వెంకటేష్, ర్యాషన్ యాదగిరి తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. ● మూసాపేటలో ఎస్సై పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ యాదవ్, మాజీ సర్పంచ్ భాస్కర్‌చందర్‌గౌడ్, నాయకులు గూపని కొండయ్య రఘురాములు, కోట్ల రవి, చంద్రయ్యగౌడ్, బందిగి మహేందర్, గోవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, మాల యాదయ్య తదితరులను అరెస్టు చేశారు. ● అడ్డాకులలో అరెస్ట్ అయిన వారిలో సింగిల్‌విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, మాజీ రైతుబంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మాజీ మండల కోఆప్షన్ ఖాజామైారి, మాజీ ఎంపీటీసీ రంగన్నగౌడ్, మహేశ్‌యాదవ్ ఉన్నారు. ● నవాబ్‌పేటలో ఎస్ఐ విక్రం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు గోపాల్ గౌడ్, తాహెర్, మెండె శ్రీను, అంజయ్య, జైపాల్ రెడ్డి తదితరులను అరెస్టు చేశారు. ● హన్వాడలో ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, కొండ లక్ష్మయ్య, బాలరాజు, పార్టీ నాయకులు జంబులయ్య, శ్రీనివాసులు, మాజీ సర్పంచి వెంకన్న, కాలె యాదయ్య, రాజుతో పాటు మరికొందరిని హన్వాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



అడ్డాకుల : అరెస్ట్ అయిన బీఆర్ఎస్ నాయకులు

క్రీడా పాలసీకి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 19 : క్రీడా పాలసీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా, యువజన సర్వీసుల శాఖ అధికారి ఎస్. శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ ఆదేశాల మేరకు క్రీడా పాలసీని రూపొందించిందని పేర్కొన్నారు. 2019 నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులు తమ వివరాలను జిల్లా కేంద్రంలోని క్రీడాశాఖ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీలోగా సమర్పించాలని, పోటీల్లో పాల్గొన్న వివరాలు, పతకాలు, ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తులను వ్యక్తి గతంగా అందజేయాలని సూచించారు. క్రీడాకారులు సమర్పించే సమాచారాన్ని కోచ్, పీడీ, పీఈటీలు ధ్రువీకరించాలన్నారు.

ఆర్థిక సహాయం

మిడ్జిల్, సెప్టెంబరు 19: మండలంలోని వెలుగొమ్ముల గ్రామానికి చెందిన ముత్యాల యాదయ్య రెండు రోజుల క్రితం మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు చందాలు వేసుకొని బాధిత కుటుంబ సభ్యులకు రూ. 6వేలు అందజేశారు. సంఘం అధ్యక్షుడు ఏలియా, సభ్యులు కృష్ణయ్య, రాజు, రాములు, కుమార్, శ్రీనివాసులు, సురేష్, శ్రీరాములు, భీమయ్య, గణేష్, శ్రీశైలం, సాయిబాబు, నాగయ్య, శ్రీను ఉన్నారు.

● దోనూర్‌లో మండలంలోని దోనూర్ గ్రామానికి చెందిన గొరిగే శేఖర్ అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్ మృతుడి కుటుంబసభ్యులకు రూ. 5వేలను అందజేశారు. పలువురు బీఆర్ఎస్ నాయకులున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో పైపులైనుకు మరమ్మతులు

జడ్చర్ల, సెప్టెంబరు 19 : జడ్చర్ల పట్టణంలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో పగిలిన నీటి సరఫరా పైపులైనులను వెంటనే మరమ్మతులు చేయించాలన్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేయించారు. పగిలిన పైపుల స్థానంలో నూతన పైపులను ఏర్పాటు చేసి, నీటి సరఫరా చేపట్టారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

మూసాపేట, సెప్టెంబరు 19 : గ్రామాల్లో ప్రతీ ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే స్వచ్ఛతగా మారి సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హి కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరున మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీవో అనురాధ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

యోగా క్రీడాకారుడికి సన్మానం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 19 : రంగారెడ్డి జిల్లాలో ఇటీవలే జరిగిన రాష్ట్రస్థాయి యోగా టోర్నీలో పురుషుల విభాగంలో జిల్లా యోగా క్రీడాకారుడు కోటకదిరే వెంకటేశ్ ప్రతిభ చాటి రజత పతకం సాధించాడు. గురువారం రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్ తన నివాసంలో వెంకటేశ్‌ను సన్మానించారు. కరాటే శిక్షణతో పాటు యోగాలో రాణించడం పట్ల ప్రత్యేకంగా అభినందించారు.

అభ్యంతరాలు ఉంచే చెప్పండి

నవాబ్‌పేట, సెప్టెంబరు 19 : మండలంలో ఇటీవల స్థానిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఎన్నికల జాబితాలో ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే ఈనెల 20 వరకు ప్రజలు తమ అభిప్రాయాలను స్థానిక కార్యదర్శులకు చెప్పాలని ఎంపీడీవో జయరాములు తెలిపారు.

తప్పొప్పులను సరిచూసుకోవాలి

భూత్పూర్, సెప్టెంబరు 19 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఓటర్ల జాబితాలను వార్డుల వారీగా ప్రదర్శించామని, ఏమైనా తప్పొప్పులు ఉటేఏ సరిచేసుకోవాలని ఎంపీడీవో ప్రభాకర్‌చారి వివిధ రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు.

ఓటరు జాబితాలో వార్డు మార్పునకు అవకాశం

కోయిలకొండ, సెప్టెంబరు 19 : ఓటర్‌లిస్ట్‌లో ఇతర వార్డుల్లో పేరు ఉంటే వారు ఉన్న వార్డులోకి పేరు మార్చుకోవచ్చునని ఎంపీడీవో కాళప్ప సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

తప్పులు ఉంటే సరి చేయాలి

హన్వాడ, సెప్టెంబరు 19 : గ్రామ స్థాయిలో ఉన్న ఓటరు లిస్టులో తప్పులు ఉంటే సరి చేద్దామని ఎంపీడీవో యశోద సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సమస్యల పరిష్కారానికి కృషి

గండీడ్, సెప్టెంబరు 19 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్‌టీయూ తెలంగాణ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాసురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా కొండయ్య, మహిళ ఉపాధ్యక్షులుగా భవ్యశ్రీ, కార్యదర్శి కృష్ణారెడ్డితో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అడ్డాకులలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

అడ్డాకుల, సెప్టెంబరు 19 : అడ్డాకుల బస్టాండ్ కూడలిలో గురువారం హోప్ స్వచ్ఛంద సంస్థ తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ అసోషియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సు విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. 25 మంది హెచ్‌ఐవీ-ఎయిడ్స్ సంబంధించిన రక్త పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంజీఓ స్టాఫ్ ప్రతినిధి సుప్రియ, ఓఆర్‌డబ్ల్యు పీసీ జ్యోతి, డీసీసీ కార్యదర్శి విజయ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రంగన్నగౌడ్, ఆజం, భీమన్నయాదవ్, సురెందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బాల్‌రాజ్, ఎన్‌జీఓ సిబ్బంది పాల్గొన్నారు.

'దళితులపై దాడులు చేసిన వారిని శిక్షించాలి'

పాలమూరు, సెప్టెంబరు 19 : దళితులపై దాడులు చేసిన వారిపైన ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యం.మాణిక్యంరాజు, యం.కుర్మయ్యలు కోరారు. గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి సమస్యలు చెప్పారు.

చెరువు, కుంటలను కాపాడాలి

జడ్చర్ల, సెప్టెంబరు 19 : చెరువులు, కుంటలలోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్యయాదవ్ డిమాండ్ చేశారు. జడ్చర్ల బీసీ జాగృతి సేవా కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.